ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
యాదాద్రి భువనగిరి
5
సోమవారం 23 డిసెంబరు 2024



హెల్ప్‌లైన్ నంబర్లు	
దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్	18005728980
నల్లగొండ	18004251442
యాదాద్రి	1800 425 7106
సూర్యాపేట	1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 84

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.123	200	220
సూర్యాపేట	రూ.125	180	210
నల్లగొండ	రూ.130	180	200

ఉష్ణోగ్రత గరిష్ఠం 29.5 । కనిష్ఠం 19.0



బీఆర్‌ఎస్‌లో సంస్థాగతమెప్పుడో?

- జిల్లా అధ్యక్షుల ప్రకటనతోనే సరి
- కార్యవర్గంతో పాటు అనుబంధ కమిటీలు నియమించని వైనం
- స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పూర్తిస్థాయి కమిటీలు ఏర్పడేనా?

స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. అయితే ఈ ఎన్నికల్లో సత్తా చాటాలని భారతీయ రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) ప్రయత్నాలు ప్రారంభించింది. అందులో భాగంగా పార్టీ సంస్థాగత ఎన్నికలపై అధిష్ఠానం దృష్టిసారించి జిల్లా, అనుబంధ కమిటీలు నియమించే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం.
- (ఆంధ్రజ్యోతి, యాదాద్రి)

టీఆర్‌ఎస్‌గా ఉన్నప్పుడు 2014కు ముందు పార్టీ సంస్థాగతంగా కీలకంగా వ్యవహరించి, ఎప్పటికప్పుడు పదవులు కేటాయిస్తూ, పర్యవేక్షిస్తూ ఉండేది. జిల్లా కమిటీలు బలోపేతంపై నిరంతరం అధ్యయనం చేసేది. అయితే అధికారంలోకి రాగానే స్థానిక ఎమ్మెల్యేలకు పూర్తి అధికారాలు బదలాయించి, ఇప్పటివరకు సంస్థాగతంగా జిల్లా కమిటీలను ఏర్పాటు చేయలేదు. బీఆర్‌ఎస్ అధికారాన్ని కోల్పోయి ఏడాది గడిచింది. ఈ నేపథ్యంలో సంస్థాగత ఎన్నికలపై పార్టీ అధిష్ఠానం దృష్టిసారించి జిల్లా, అనుబంధ కమిటీలు నియమించే ఆలోచనలో ఉన్నట్టు సమాచారం. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పార్టీ బలోపేతం చేసే దిశగా పార్టీ అడుగులు వేస్తోంది.

జిల్లా అధ్యక్షులతోనే సరి

టీఆర్‌ఎస్‌ను భారతీయ రాష్ట్ర సమితీ (బీఆర్‌ఎస్)గా మారుస్తూ, జాతీయ రాజకీయాల్లోకి పార్టీ అరగేంట్రం చేసింది. జాతీయ పార్టీగా ఆవిర్భవించిన అనంతరం సంస్థాగత పదవులపై బీఆర్‌ఎస్ నేతల్లో ఆశలు రేకెత్తాయి. 2022 జనవరి 26న అధిష్ఠానం 33 జిల్లాలకు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులను ప్రకటించింది. యాదాద్రి జిల్లా అధ్యక్షుడిగా కంచర్ల రామకృష్ణారెడ్డి, నల్లగొండ జిల్లా అధ్యక్షుడిగా దేవరకొండ నాటి ఎమ్మెల్యే రవీంద్రనాయక్, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడిగా నాటి రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్‌ను అధిష్ఠానం పార్టీ నియమించింది. అయితే జిల్లా అధ్యక్షులకే పరిమితం చేసిన అధిష్ఠానం జిల్లా, పార్టీ అనుబంధ సంఘాలకు పూర్తిస్థాయి కార్యవర్గాన్ని నియమించలేదు. మూడేళ్లుగా సంస్థాగత పదవుల కోసం పార్టీ నాయకులు ఎదురుచూస్తున్నారు.

పునరుద్ధరణకు నోచుకోని కమిటీలు

జిల్లాల్లో అన్ని రాజకీయ పార్టీలకు సంస్థాగతంగా కమిటీలు ఉన్నాయి. ఏడేళ్ల క్రితం టీఆర్‌ఎస్ అధిష్ఠానం జిల్లా కమిటీలను రద్దు చేసింది. పార్లమెంట్ నియోజకవర్గ స్థాయిలో రాష్ట్ర కార్యదర్శులకు పార్టీ వ్యవహారాలను అప్పగించింది. నియోజకవర్గాల్లో పార్టీ పరంగా తీసుకునే కీలక నిర్ణయాలపై సర్వ అధికారాలు స్థానికంగా ఉండే ఎమ్మెల్యేలకు అప్పగించింది. స్థానికంగా ఉన్న ఎమ్మెల్యేలతో పొసగని పలువురు సీనియర్ నేతలు కొంతకాలంగా రాజకీయపరంగా నిశ్శబ్దంగా ఉన్నారు. జిల్లాలో నియోజకవర్గాల్లో నిర్వహించే పలు పార్టీ కార్యక్రమాలకు హాజరవుతూ, పార్టీలోనే కొనసాగుతున్నారు. మరోవైపు స్థానికంగా ఉన్న ద్వితీయ శ్రేణి నేతలకు రాజకీయంగా తీసుకునే నిర్ణయాల్లో అవకాశం కల్పించకపోవడంతో, వారు ఎదగలేకపోయారని అధిష్ఠానం గ్రహించింది. పార్టీలో సంస్థాగతంగా ఉన్న విభేదాలు సమసిపోవాలంటే పార్టీని జిల్లా కమిటీలకే అప్పగించాలని నిర్ణయానికి వచ్చింది. ఈ నేపథ్యంలో...


- మిగతా 7వ పేజీలో...

రాష్ట్రస్థాయిలోనూ పాత కార్యవర్గమే

పార్టీ అధిష్ఠానం 2017లో అప్పటి టీఆర్‌ఎస్ మహాసభల్లో ప్రకటించిన రాష్ట్ర కార్యవర్గమే నేటికీ కొనసాగుతోంది. పార్టీ బీఆర్‌ఎస్‌గా మారినా రాష్ట్ర కార్యవర్గాన్ని ఏర్పాటుచేయలేదు. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో నూతన కార్యవర్గాల ఏర్పాటుపై పార్టీ నేతల్లో జోరుగా చర్చ జరుగుతోంది. అయితే రాష్ట్ర వ్యాప్తంగా పార్టీని బలోపేతం చేయాలన్న ఉద్దేశంతో అధిష్ఠానం సంస్థాగతంగా నూతన కమిటీలు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. బీఆర్‌ఎస్ 2021 సెప్టెంబరు 2 నుంచి సంస్థాగత ఎన్నికలు నిర్వహించింది. సెప్టెంబరు 2 నుంచి 12వ తేదీ వరకు 15మంది సభ్యులతో గ్రామస్థాయిలో ప్రధాన కమిటీలు ఏర్పాటు చేసింది. ప్రతీ గ్రామంలో విద్యార్థి, యువజన, మహిళ, కార్మిక, తదితర 14 అనుబంధ సంఘాలను నియమించింది. 13 నుంచి 20వ తేదీ వరకు మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసింది. 2022 జనవరి 26న ముఖ్యమంత్రి పార్టీ జిల్లా అధ్యక్షులను ప్రకటించారు. అయితే నాటి నుంచి ఇప్పటివరకు కార్యవర్గాలను, పార్టీ అనుబంధ కమిటీలను నియమించలేదు. ప్రస్తుతం స్థానిక సంస్థలు వస్తున్న నేపథ్యంలో పార్టీ సంస్థాగతంగా పదవులను భర్తీ చేసే ఆలోచనలో ఉన్నట్లు స్థానికంగా నేతల్లో జోరుగా చర్చ సాగుతోంది.

'గృహజ్యోతి' లబ్ధిదారులు
పెరిగారు

- చలికాలంలో విద్యుత్ పొదుపే కారణం
- 10 నెలలుగా 1.44లక్షల మందికి రూ.41.59కోట్లు సబ్సిడీ



భువనగిరి టౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పెరిగిన చలితో ఇళ్లలో ఫ్యాన్లు, ఏసీలు తదితర విద్యుత్ ఆధారిత గృహోపకరణాల వినియోగం తగ్గింది. అలాగే గృహజ్యోతి అమలుకు 200 యూనిట్ల కటాఫ్ ఉండటంతో పలువురు విద్యుత్ పొదుపు పాటిస్తున్నారు. ఫలితంగా క్రమేపీ జిల్లాలో గృహజ్యోతి లబ్ధిదారుల సంఖ్య పెరిగింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మకమైన ఆరు గ్యారెంటీల్లో ఒకటైన గృహజ్యోతి పథకం కారణంగా పెరుగుతున్న విద్యుత్ పొదుపుతో జెన్‌కోపై ఉత్పత్తి భారంతోపాటు డిస్కంలపై సరఫరా భారం తప్పినట్టయిందని అధికారులు పేర్కొంటున్నారు. అలాగే వినియోగదారులకు నెలవారీగా తప్పుతున్న విద్యుత్ చార్జీల భారం ఇతర అవసరాలకు ఉపయోగపడుతున్నట్లు పలువురు పేర్కొంటున్నారు. కాగా, జిల్లాలో గృహ విద్యుత్ కనెక్షన్లు 2,75,089 ఉండగా, గృహజ్యోతి పథకం ప్రారంభమైన మార్చి నుంచి డిసెంబరు...

- మిగతా 8వ పేజీలో...

నెల	వినియోగదారులు (యూనిట్లు)	సబ్సిడీ (రూ.లో)
మార్చి	1,29,603	3,08,54,080
ఏప్రిల్	1,29,603	3,86,01,396
మే	1,29,603	3,83,23,397
జూన్	1,38,720	4,30,88,651
జూలై	1,38,190	4,23,36,422
ఆగస్టు	1,41,689	4,30,48,839
సెప్టెంబరు	1,43,641	4,75,79,571
అక్టోబరు	1,43,641	4,46,65,189
నవంబరు	1,44,569	4,94,25,118
డిసెంబరు	1,44,780	3,80,39,299
మొత్తం	1,41,780	41,59,61,962

పొదుపు మంచిదే



విద్యుత్ పొదుపు మంచిదే. విద్యుత్‌ను 200 యూనిట్ల లోపు వాడితే వినియోగదారులకు గృహజ్యోతి లబ్ధి వర్తిస్తుంది. అదే సమయంలో విద్యుత్ సంస్థలపై పలు భారాలు తప్పుతున్నాయి. విద్యుత్‌ను పొదుపుగా వినియోగించడం అందరూ అలవాటు చేసుకోవాలి. ఇళ్లలో వృథాగా తిరిగే ఫ్యాన్లు, వెలిగే లైట్లను ఎప్పటికప్పుడు ఆర్పివేయాలి. గృహజ్యోతి వర్తించని వినియోగదారులు సకాలంలో బిల్లులు చెల్లించాలి. నాణ్యమైన సేవలు అందించేందుకు తమ సిబ్బంది క్షేత్రస్థాయిలో చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారు.
- సుధీర్‌కుమార్, ట్రాన్స్‌కో ఎస్‌ఈ

బలహీన వర్గాల ఆశాజ్యోతి కాకా

కలెక్టర్ హనుమంతరావు



వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి (కలెక్టరేట్), డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పేదల, కార్మిక నాయకుడిగా, అణగారిన వర్గాలకు అండగా కాకా చేసిన సేవలు మరువలేనివని కలెక్టర్ అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి (కాకా) వర్ధంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు. దేశానికి, రాష్ట్ర ప్రజలకు ఆయన చేసిన సేవలు మరువలేనివని అన్నారు. దళిత, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి చేసిన కృషిని గుర్తిస్తూ ప్రభుత్వం ఆయన జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. వెంకటస్వామి అడుగు జాడల్లో నడుస్తూ ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. తొలితరం స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమకారుడు వెంకటస్వామి చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ జినుకల శ్యాంసుందర్, జిల్లా వ్యవసాయాధికారి గోపాల్, సూపరింటెండెంట్ రామమూర్తి, పలు గురుకులాల ప్రిన్సిపాళ్లు, వార్డెన్లు, వసతి గృహాల విద్యార్థులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట అభివృద్ధికి ప్రణాళికలు

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



యాదగిరిగుట్టలో ప్రభుత్వ అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న మంత్రి వెంకట్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, విప్ అయిలయ్య

యాదగిరిగుట్ట రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని, త్వరలో పనులు ప్రారంభిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఆదివారం గుట్టలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చట్టం తనపని తాను చేసుకుంటుందని, అందుకే అల్లు అర్జున్‌ను పోలీసులు అరెస్టు చేశారన్నారు. మృతురాలు రేవతి విషయంలో సీపీ ఆనంద్ చెప్పిన విషయాలను సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించడాని తప్పుబట్టి అవమానించిన అల్లు అర్జున్ బేషరత్‌గా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రేవతి మృతికి కారణమైన ఆయన మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. పోలీసులను దుర్భాషలాడటం ఏంటని, ట్విట్టర్ టిల్లు, అగ్గిపెట్టె లంబూ అల్లు అర్జున్‌కు వత్తాస్ పలకడమేంటని ప్రశ్నించారు. రేవతి కుటుంబానికి రూ.25లక్షల ఆర్థిక సహకారం అందించానని, ఆమె కుమారుడిని బతికించాలని వైద్యులను కోరామని, వైద్యానికి ఎంత ఖర్చయినా ప్రభుత్వమే భరిస్తోందన్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా డబ్బు మదంతో అంబేడ్కర్‌పై అనుచితంగా మాట్లాడారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఇరిగేషన్‌శాఖ మం త్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో గంధమల్ల పూర్తిచేసి ఆలేరుతో పాటు ఇతర నియోజకవర్గాలను సస్యశ్యామలం చేస్తామన్నారు. ఒకటిన్నర టీఎంసీలతో నిర్మాణం చేస్తే లక్ష ఎకరాలు సాగులోకి వస్తాయని గంధమల్ల రిజర్వాయర్ పనులు ఫిబ్రవరిలో ప్రారంభిస్తామన్నారు. యాదగిరిగుట్ట అభివృద్ధి కోసం ప్రణాళికలు ఉన్నాయని, త్వరలో వాటిని ప్రారంభిస్తామన్నారు.

భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, మైనార్టీలపై జరుగుతున్న దాడులపై పార్లమెంట్‌లో చర్చించడం లేదని, ఇండియా కూటమి ధర్నా చేయకుండా అడ్డుకుందని, బీజేపీకి జమిలి ఎన్నికలపై తప్ప పార్లమెంట్‌లో ఏ విషయంపై చర్చ జరగడం ఇష్టంలేదన్నారు. ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మాట్లాడుతూ, ఏడు రోజులుగా 38గంటలపాటు జరిగిన రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలకు ప్రతిపక్షనాయకుడు అసెంబ్లీకి రాకపోగా, ప్రతిపక్షాలు వ్యవహరించిన తీరు బాధాకరమన్నారు. ఇప్పటి వరకు ఆలేరు నియోజకవర్గంలో 120 చెరువులను నింపి సస్యశ్యామలం చేస్తామన్నారు. మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు మాట్లాడుతూ, అంబేడ్కర్‌ను అమానించిన అమిత్‌షా కచ్చితంగా దేశ ప్రజలకు, దళితజాతికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రభుత్వ అంబులెన్స్ వాహనాన్ని మంత్రి ప్రారంభించారు. స్థానిక మునిసిపల్ కార్యాలయ ఆవరణలో గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో కలెక్టర్ హనుమంతరావు, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ చైతన్యరెడ్డి, స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధ, పార్టీ మండల అధ్యక్షుడు కానుగు బాలరాజ్‌గౌడ్, మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, కౌన్సిలర్లు ముక్కెర్ల మల్లేశ్‌యాదవ్, గుండ్లపల్లి వాణీభరత్‌గౌడ్, నాయకులు బందారపు భిక్షపతిగౌడ్, ఎరుకల హేమేందర్‌గౌడ్, శంకర్‌నాయక్, దుంబాల వెంకట్‌రెడ్డి, శిఖ ఉపేందర్‌గౌడ్, సత్యప్రకాష్‌గౌడ్ పాల్గొన్నారు.

పల్లెలే దేశానికి పట్టుకొమ్మలు



గాంధీ గ్లోబల్ సదస్సులో రైతును సన్మానిస్తున్న మంత్రి వెంకట్‌రెడ్డి, బీర్ల, కుంభం

పల్లెలే దేశానికి పట్టుకొమ్మలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం గుట్టలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సుస్థిర విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్పొరేట్ల ఆగమనంతో దేశంలో ఇప్పటికే సగం పల్లెటూళ్లు పల్లెదనం కోల్పోయాయన్నారు. తమ ప్రజా ప్రభుత్వం రైతన్న బతుకు బాగు చేయాలని 25లక్షల మందికి రూ.2లక్షల చొప్పున రుణమాఫీ చేసిందని, ఉచిత విద్యుత్ పథకాన్ని ఇచ్చి అండగా ఉందన్నారు. ప్రభుత్వం సంక్రాంతికి రైతు భరోసా ఇచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తోందన్నారు. 10 రాష్ట్రాల్లో సేంద్రియ ఎరువులతో వ్యవసాయం చేసిన 115మంది రైతు జంటలకు పుడమిపుత్ర అవార్డులు, 35మంది అధికారులు, శాస్త్రవేతలు, జర్నలిస్టులకు కిసాన్‌సేవా అవార్డులు అందజేశారు. అనంతరం విద్యార్థుల సైన్స్‌ఫెయిర్‌ను సందర్శించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎంపీ చామలకిరణ్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, ఆలేరు, భువనగిరి మార్కెట్ కమిటీ చైర్మన్లు చైతన్యరెడ్డి, అవేస్, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ రాష్ట్ర చైర్మన్ గున్న రాజేందర్‌రెడ్డి, పడమటి పావని, మెరుగు మధు, మాటూరి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్ వాసుల త్యాగాలు మరువలేనివి

ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి



పునరావాస ప్రాంతంలో పైపులైన్ పనులకు భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ఎత్తిపోతల్లో భాగంగా బస్వాపూర్ రిజర్వాయర్ నిర్మాణంలో పూర్తిగా ముంపునకు గురవుతున్న బీఎన్.తిమ్మాపూర్ గ్రామస్థుల త్యాగాలు మరువలేనివని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద భువనగిరి శివారులోని 107 సర్వే నెంబర్‌లో కేటాయించిన పునరావాస ప్రాంతంలో పలు అభివృద్ధి పనులకు ఆదివారం భూమి పూజ నిర్వహించారు. రూ.45కోట్ల వ్యయంతో చేపడుతున్న జడ్పీ ఉన్నత, ప్రాథమిక పాఠశాల, కమ్యూనిటీ హాల్, బీటీ, సీసీరోడ్ల నిర్మాణాలు, రూ.35లక్షల వ్యయంతో బస్వాపూర్ నుంచి పునరావాస ప్రాంతం వరకు పైపులైన్ ఏర్పాటు పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిర్వాసితుల త్యాగం వల్లే బస్వాపూర్ రిజర్వాయర్ నిర్మాణం సాధ్యమైందని, సాగు నీటి సరఫరాతో 3 జిల్లాల్లోని పలు ప్రాంతాలు సస్యశ్యామలమవుతాయన్నారు. ఇప్పటికే ప్రభుత్వం రూ.50కోట్ల నిధులు మంజూరు చేసిందని, మరో రూ.200కోట్ల నిధుల మంజూరుకు తన వంతు కృషి చేసి పునరావాస ప్రాంతంలో అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రస్తుతం చేపడుతున్న మౌలిక వసతుల పనులను నాణ్యతతో, వేగంగా పూర్తిచేయాలని సదరు కాంట్రాక్టర్లను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో ఎం.కృష్ణారెడ్డి, మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేస్‌చిస్తీ, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈలు వెంకటేశ్వర్లు, కరుణాకర్, కౌన్సిలర్ గుండెగల్ల అంజమ్మ ఎల్లయ్య, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఎడ్ల సత్తిరెడ్డి, ఉడుత శారద ఆంజనేయులు, పిన్నం లతరాజు, రావుల నందు, జిన్న మల్లేశం, అన్నెపు గణేశ్, జిన్న నర్సింహ, దర్శన్‌రెడ్డి, ఇన్‌చార్జి తహసీల్దార్ కోట్ల కల్యాణ్, వివిధ శాఖల అధికారులు ప్రశాంత్ కుమార్, శంకర్‌బాబు, ప్రసాద్, గుండురావు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి మహా పడిపూజ



ఆలేరులో అయ్యప్పస్వామి పంబారట్టు శోభాయాత్రలో పాల్గొన్న గొంగిడి మహేందర్‌రెడ్డి

ఆలేరు,డిసెంబరు22 (ఆంధ్రజ్యోతి):అయ్యప్పస్వామి మహా పడిపూజ, పంబారట్టు శోభాయాత్ర ఆదివారం ఆలేరులో మాలధారులు, గురుస్వాములు వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని ఆలేరు కమిటీ, అయ్యప్ప సేవాసమతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాలకు మాలధారులతో పాటు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. తొలుత పట్టణంలోని కనకదుర్గాదేవి ఆలయం నుంచి పంబారట్టు శోభాయాత్ర ప్రారంభమై బస్టాండ్, రైల్వేస్టేషన్, రైల్వేగేట్ చౌరస్తా, సిల్క్‌నగర్, మార్కండేయనగర్, ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ మీదుగా అయ్యప్పస్వామి ఆలయం సన్నిధికి చేరింది. ఆటపాటలు, నృత్యాలతో సాగిన ఈ శోభాయాత్ర భక్తి పారవశ్యంతో సాగింది. ఈసందర్భంగా భక్తుల అయ్యప్పస్వామి నామస్మరణతో వీధులు మార్మోగాయి. అనంతరం ఆలయంలో మహాపడి పూజపాలెం మనోహరశర్మ, పాచికంటి ధనుంజనేయశాస్త్రి, గురుస్వాములు మొరిగాడి వెంకటేష్, స్వరబ్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గణపతిపూజ, సుబ్రహ్మణ్యస్వామి అయ్యప్పస్వామి విగ్రహాలను 18 మెట్లపై అలంకరించిన వేదికపై ప్రతిష్ఠింపజేశారు. ప్రతీ మెట్టుపై పూలు, పండ్లు ఉంచి జ్యోతులు వెలిగించారు. ముందుగా గణేష్ పూజతో కార్యక్రమం ప్రారంభమైంది. పంచామృతాలతో అయ్యప్ప విగ్రహాన్ని అభిషేకించారు. అనంతరం అయ్యప్ప భక్తులకు భిక్ష నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతారెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, అక్షయ్‌రెడ్డి దంపతులు, గురుస్వాములు ఎలుగుల చంద్రమౌళి, వరుదరాజుల పంతులు, మంగలంపల్లి నాగరాజు, దూడల యాదగి రి పాచికంటి శ్రీనివాస్, రాంబాబు, హరీష్, రవి, సిద్దులు, రా జు, కృష్ణ, ఉపేందర్, శివ, చంద్రశేఖర్, శ్రీకాంత్, శ్రీధర్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు పల్లూరి రామ్‌చంద్రరెడ్డి, మునిసిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, గంగుల శ్రీనివాస్, మహేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, పాల్గొన్నారు.

యాదగిరి క్షేత్రంలో భక్తుల సందడి

నిత్యాదాయం రూ.57.52 లక్షలు 7

క్రిస్మస్ వేడుకలకు ముస్తాబు


విద్యుద్దీపాల అలంకరణలో మఠంపల్లిలోని శుభవార్త దేవాలయం



- ప్రత్యేక అలంకరణలో చర్చిలు, ప్రార్థనా మందిరాలు
- మఠంపల్లిలో రెండు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు

క్రిస్మస్ పర్వదిన వేడుకలకు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పలుచర్చిలు ముస్తాబయ్యాయి. దశాబ్దాల చరిత్ర కలిగిన సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల కేంద్రంలోని శుభవార్త దేవాలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. అదేవిధంగా నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని పలు చర్చిలు వేడుకలకు ముస్తాబుచేశారు.

మఠంపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ తెలంగాణలోనే అతి పెద్ద చర్చిగా పేరొందిన సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల కేంద్రంలోని శుభవార్త దేవాలయం క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైంది. ఈ నెల 24, 25 తేదీల్లో నిర్వహించే మహోత్సవాలకు దేవాలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. పరవళ్లు తొక్కే కృష్ణానదీ తీరాన వెలసిన శుభవార్త దేవాలయం మరియమాత దీవెనలతో విరాజిల్లుతోంది. ఇక్కడ కులాలకు, మతాలకు అతీతంగా ప్రార్థనలు చేస్తూ మరియమాత దీవెనలు పొందుతుంటారు. ఈ లోకానికి రక్షకుడిని అందించిన తల్లిగా భక్తుల బాధలను, వ్యాధులను, ఇతర సమస్యలను తన కుమారుడిని ప్రార్థించే వారి అవసరాలు తీర్చే తల్లిలా ఆమె ప్రసిద్ధి. శుభవార్త దేవాలయం(మంగళవార్త చర్చి) 1968లో నిర్మించారు. అనంతరం పునర్నిర్మాణంలో భాగంగా 1980లో శంకుస్థాపన చేయగా 1993వ పూర్తి చేశారు. అప్పటివరకు మంగళవార్త చర్చిగా పిలవబడుతున్న దేవాలయానికి శుభవార్త దేవాలయంగా నామకరణం చేశారు. వేడుకలకు గ్రామానికి చెందిన క్రైస్తవ కుటుంబీకులతో పాటు ఇతర ప్రాంతాలు, రాష్ట్రాల్లోని బంధువులు హాజరవుతుంటారు. రెండు రోజుల పాటు జరిగే వేడుకల వివరాలను విచారణ గురువు మార్టిన్ పసల శుక్రవారం ప్రకటించారు. ప్రతి రోజూ ఉదయం 6 గంటలకు నవదిన జపములు, దివ్యబలిపూజ కార్యక్రమాలు, క్రైస్తవ భక్తులను ఉద్దేశించి ప్రసంగం, పండగ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. 25న జరిగే శుభవార్త చర్చి జాతరకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాలలో ఉన్న ప్రముఖులు, గురువులు, బిషప్‌లతో పాటు విదేశాల్లోని క్రైస్తవులు కూడా హాజరై ప్రార్థనలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

మర్రిగూడ మండలంలో

మర్రిగూడ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : క్రైస్తవుల ఆరాధ్య దైవమైన ఏసు క్రీస్తు జన్మదినం సందర్భంగా క్రిస్మస్ వేడుకలకు నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని చర్చిలను ముస్తాబు చేస్తున్నారు. కమ్మగూడెం గ్రామంలో పునీత జోజప్ప మందిరాన్ని నిర్మించి సుమారు 50 ఏళ్ల పూర్తయ్యాయి. ఈ చర్చిని అప్పటి ఫాదర్ కాశీరాం ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా నిర్మించుకున్నారు. అప్పటి నుంచి ఇక్కడ క్రైసవ సోదరులు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించుకుంటారు. పూర్వీకులు నిర్మించిన ఈ మందిరాన్ని జ్ఞాపకం చేసుకుంటూ క్రిస్మస్ సందర్భంగా వేడుకలను నిర్వహించుకుంటారు. అదేవిధంగా ఎబినేజర్ ప్రార్థన మందిరంలో మౌంట్ సినాయి సువార్త సంఘం, శాలోమ్ పలు మందిరాలను క్రైస్తవ సోదరులు ముస్తాబు చేశారు. ఇప్పటికే పలు చర్చిల్లో సెమీక్రిస్మస్ సంబురాలు, ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. ప్రత్యేక ప్రార్థనలతో చర్చిల ఆవరణలు ఆహ్లాదకరంగా మారాయి. ఈ నెల 25న క్రిస్మస్ వేడుకలను క్రైస్తవ సోదరులు ఘనంగా నిర్వహించుకోవడానికి అన్ని సిద్ధం చేసుకుంటున్నారు.


చర్చిలోపల అలంకరణ


మర్రిగూడ మండలం కమ్మగూడెంలో 100 అడుగుల ఎత్తులో నిర్మించిన గోపురాలతో చర్చి ప్రాంగణం

కబడ్డీ రాష్ట్రస్థాయి పోటీలకు
జిల్లా బాలికల జట్టు


ఆలేరు నుంచి వెళ్తుతున్న కబడ్డీ జిల్లా జట్టు క్రీడాకారులు

ఆలేరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని హకీంపేటలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి పోటీలకు యాదాద్రిభువనగిరి జిల్లా బాలిక జట్టు ఆదివారం బయలుదేరింది. ఈ నెల 22 నుంచి 25 వరకు హకీంపేట బాలికల గురుకుల క్రీడామైదానంలో పోటీలు జరుగుతున్నట్లు క్రీడాకారులు తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు వెళ్తున్న జిల్లా జట్టును ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యయులు, పలువురు అభినందించారు. కబడ్డీలో రాష్ట్రస్థాయి ప్రథమ విజేతలుగా నిలవాలని ఆశీర్వదించారు. అనంతరం జట్టు క్రీడాకారులను ఆర్టీసీ బస్సులో తీసుకెళ్లారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు మాదాసు జోసఫ్, కబడ్డీ జిల్లా అసోసియేషన్ కోశాధికారి గంధమల్ల కుమార్, సహాయ కార్యదర్శులు పూల చంద్ర కుమార్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ జిల్లా స్థాయి పోటీల్లో ప్రథమస్థానం


ప్రథమ విజేతగా నిలిచిన జట్టును అభినందిస్తున్న గ్రామ యువకులు

ఆలేరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఫుట్‌బాల్ జిల్లా స్థాయి పోటీల్లో ఆలేరు మండలం గుండ్లగూడెం జట్టు ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచింది. క్రీడాకారులను గ్రామానికి చెందిన యువకులు అభినందించారు. పోటీల్లో విజేత నిలిచిన జట్టు నుంచి ఆరుగురు రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికచేశారు. వారిలో పీ రాజేష్, కే రాజు, వెంకటేష్, దినేస్, వీరేందర్ ఉన్నారు.

న్యాయమూర్తి తులాభారం


యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రం సమీపంలోని స్వర్ణగిరి ఆలయాన్ని భువనగిరి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం ఉషశ్రీ కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. స్వామి వారి దర్శన అనంతరం తులాభారంతో మొక్కులు చెల్లించుకున్నారు.

(ఆంధ్రజ్యోతి-భువనగిరి టౌన్)

ఏం చేస్తాం.. తాళం చెవి పోయింది





యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి పట్టణం పరిధి రాయగిరిలో ఆదివారం ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న పోలీసుల వాహనం తాళం చెవి ఎక్కడో పోయింది. చుట్టుపక్కలా వెతికినా కనిపించకపోవడంతో మరో వాహనంతో ఆ వాహనాన్ని తీసుకెళ్లారు. ప్రజలు దీనిని ఆసక్తిగా తిలకించారు.

వీల్‌చైర్ క్రికెట్‌లో ప్రతిభ చాటిన సురేష్

తిరుమలగిరి(సాగర్), డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి వీల్ చైర్ క్రికెట్ పోటీల్లో నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలంలోని రంగుండ్లతండాకు చెందిన సురేష్ మరోసారి తనప్రతిభను చాటాడు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్ నగరంలో ఉమాంగ్ గౌరవదీప్ నేషనల్ వీల్‌చైర్ క్రికెట్ పోటీలు ఈనెల 4 నుంచి 6వ తేదీ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా టోర్నీలో శారీరకంగా వైకల్యం ఉన్నప్పటికీ సురేష్ పలు మ్యాచ్‌లో ప్రతిభను కనబరిచాడు. ఫైనల్ మ్యాచ్ తెలంగాణ, జమ్ముకశ్మీర్ రాష్ట్రాల మధ్య జర్గ్గా తెలంగాణ రాష్ట జట్టు ఘన విజయం సాధించింది. కీలకమైన ఆరు వికెట్లను తీయడంతో పాటు మంచి పరుగులు సాధించి ఆల్‌రౌండ్ ప్రతిభను చాటాడు. ఈ సందర్భంగా సురేష్‌ను తండావాసులు అభినందించారు.


ఫైనల్ ట్రోఫీతో ధరావత్ సురేష్

కాలినడక భక్తులకు నేరుగా దర్శనం


సమావేశంలో కరపత్రాలను చూపిస్తున్న అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి నాయకులు

నల్లగొండ, కల్చరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): శబరిమలకు కాలినడకన వెళ్లే భక్తులకు క్యూలో నిలబడకుండా నేరుగా అయ్యప్పస్వామి దర్శనం చేసుకునే సౌకర్యాన్ని కేరళ ప్రభుత్వం కల్పించిందని అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి కేంద్ర కమిటీ అధ్యక్షుడు రాజు దేశ్పాండే, ఆర్గనైజింగ్ కార్యదర్శి యాదయ్య, ప్రచార కార్యదర్శి సోము, పూల గురుస్వామి తెలిపారు. ఆదివారం నల్లగొండలోని అయ్యప్ప సేవా సంస్థ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని 2022 ఏప్రిల్‌లో కేంద్ర కమిటీ ద్వారా కేరళ సీఎంకు వినతిపత్రం సమర్పించామన్నారు. అందుకు స్పందనగానే ఈ ఏడాది అమలుచేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా శబరిమలకు వెళ్లే అయ్యప్పమాలధారణ స్వాములకు రూ.5లక్షల ఉచిత ప్రమాద బీమ సౌకర్యాన్ని కల్పించినట్లు తెలిపారు. అదేవిధంగా పిల్లలకు, స్త్రీలకు, దివ్యాంగులకు ప్రత్యేక క్యూలైన్ ద్వారా స్వామి వారి దర్శనానికి దేవస్థానం బోర్డు అనుమతి ఇచ్చిందన్నారు. సమావేశంలో సంస్థ కార్యవర్గ సభ్యులు పుట్టబోతుల కృష్ణమూర్తి, కందగట్ల విఠల్, కోట శ్రీనివాస్, బిక్షమయ్య, నిఖిల్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తుడిగా మార్చిన సినిమా

యాదాద్రిభువనగిరి చౌటుప్పల్‌లో ప్రదర్శించిన అయ్యప్పస్వామి మహత్యం సినిమా ఓ సామాన్యుడిని అయ్యప్ప దీక్షాపరుడిగా మార్చింది. అదే భక్తుడికి వచ్చిన ఒక కల దేవాలయ నిర్మాణానికి కారణమైంది. ఇప్పుడా భక్తుడు ప్రసిద్ధ గురుస్వామిగా 35వ సారి మాలధారణతో శబరిమలై యాత్రకు సిద్ధమవుతున్నాడు. ఈ క్రమంలో 35 ఏళ్లలో వేలాది మంది భక్తులకు మాలధారణ చేయిస్తున్నాడు. భక్తులకు ఆయన చేసిన సేవలకు గాను అనేక పురస్కారాలను అందుకున్నారు. తెలుగు రాష్ట్రాల్లోని అయ్యప్పస్వాములు, భక్తులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్న చౌటుప్పల్ పట్టణానికి చెందిన బొబ్బిళ్ల మురళిగురుస్వామి 35 ఏళ్ల ప్రస్థానం ఇది.

\- (ఆంధ్రజ్యోతి-చౌటుప్పల్ టౌన్)

- సామాన్యుడి నుంచి ప్రతిభావంతమైన గురుస్వామిగా..
- అయ్యప్ప ఉపదేశాన్ని నిజం చేస్తూ దేవాలయ నిర్మాణం
- అయ్యప్ప సేవలో అనేక పురస్కారాలు
- తెలుగు రాష్ట్రాల్లోని భక్తులకు స్ఫూర్తి మురళీగురుస్వామి


బొబ్బిళ్ల మురళి గురుస్వామి


మురళి అయ్యప్పస్వామి దేవాలయం

చౌటుప్పల్ పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త బొబ్బిళ్ల మురళి 1989లో శరత్‌బాబు నటించిన అయ్యప్పస్వామి మహత్యం సినిమాను స్థానిక థియేటర్‌లో చూసి భక్తి మార్గం వైపు ప్రేరణ పొందారు. అదే సంవత్సరం నవంబరు 25న అయ్యప్పమాల వేసుకొని 41 రోజుల దీక్షను చేపట్టారు. నాటి నుంచి నేటి వరకు మురళి మాలధారణతో దీక్షను నిర్వహిస్తూ గురుస్వామిగా అందరి ప్రశంసలను అందుకుంటున్నారు. మాలధారణతో దీక్షలను నిర్వహిస్తున్న 9ఏళ్ల తరువాత మురళికి అయ్యప్పస్వామి కలలోకి వచ్చి తనకు ఈ ప్రాంతంలో గుడి కట్టించాలని ఉపదేశించారట. ఆ ఉపదేశాన్ని నిజం చేస్తూ పట్టణంలోని ఊర చెరువు ఒడ్డున 1998 జూన్‌లో ఒక చిన్న రేకుల షెడ్డును వేయించి అందులో అయ్యప్పస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించి నిత్యపూజలు ప్రారంభించాడు. ఈ గుడిలో పూజలు చేసేందుకు అయ్యప్పమాలధారులతో పాటు భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరిగింది. దీంతో ఆ చెరువు పరిసర ప్రాంతాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. స్వామి నామస్మరణతో మారుమోగేవి. దేవాలయానికి ప్రాముఖ్యం పెరగడంతో ఆధ్యాత్మిక వేత్తలు, పీఠాధిపతులు, సాధువులు విచ్చేసి భక్తులకు ఉపదేశాలు, ప్రవచనాలు ఇచ్చేవారు.

2001 నుంచి అన్నదానం

మురళి గురుస్వామి ప్రవేశపెట్టిన 2001 నుంచి అయ్యప్పదీక్షల సందర్భంగా ప్రారంభమైన అన్నదాన కార్యక్రమాలు నేటికీ కొనసాగుతున్నాయి. ప్రతీ ఏడాది నవంబరు 16 నుంచి జనవరి 12 వరకు ఈఅన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు. ఈదేవాలయ సన్నిధానంలో 500నుంచి 600మందివరకు అయ్యప్ప స్వామి దీక్షాదారులు ఆశ్రయం పొందుతారు. ఈదేవాలయంలో స్వాములకు అన్నదానం చేసేందుకు భక్తులు అడ్వాన్స్ బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుంది.

మాంసాహారాన్ని త్యజించిన మురళి

మొదటి మాలాధారణ చేసిన 1989 సంవత్సరం నుంచి మురళి మాంసాహారాన్ని త్యజించారు. చిన్నప్పటి నుంచే మద్యపానం అలవాటు లేదు. శబరిమలైకు వెళ్లిన 34 పర్యాయాల్లో 30 సార్లు పెద్ద పాదం (60 కిలోమీటర్లకు పైగా) నుంచి వెళ్లి జ్యోతి దర్శనం చేసుకున్నారు. 2020లో ప్రబలిన కరోనా సమయం నుంచి చిన్నపాదం(7 కిలోమీటర్లు నడిచి) నుంచి నాలుగు సార్లు జ్యోతి దర్శనం చేసుకున్నారు. మాల ధారణ చేసుకున్నటి నుంచి 34సార్లు జ్యోతి దర్శనం చేసుకోవడం విశేషం.

2012లో దేవాలయానికి భూమిపూజ

మురళి తీసుకున్న ప్రత్యేక చొరవతో చిన్న రేకుల షెడ్‌లో ఉన్న అయ్యప్పస్వామికి పెద్ద దేవాలయం నిర్మాణం చేసేందుకు 2012లో శ్రీసిద్దేశ్వర భారతీస్వామి భూమి పూజ నిర్వహించారు. దాతల సహకారంతో రూ.1.62 కోట్లను వెచ్చించి ఆధ్యాత్మికత ఉట్టి పడేలా దేవాలయాన్ని నిర్మించారు. 2015 మే 31 నుంచి జూన్ 4 వరకు నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాలలో అయ్యప్పస్వామితో పాటు వినాయకుడు, పరమేశ్వరీదేవి, సుబ్రమణ్యస్వామిల విగ్రహాలను ప్రతిష్ఠించారు. దేవాలయ నిర్మాణంలో మురళి గురుస్వామి నిర్వహించిన పాత్రను అందరూ ప్రశంసిస్తున్నారు. ఈ దేవాలయానికి మురళి గురుస్వామి వ్యవస్థాపక అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

అనేక పురస్కారాలు

ప్రజలలో ఆధ్యాత్మిక భావనను పెంపొందించడంలో మురళి గురుస్వామి చేసిన సేవలకు అనేక పురస్కారాలను అందుకున్నారు. అందులో ప్రధానంగా మూడుసార్లు ఉత్తమ గురుస్వామిగా పురస్కారాలను అందుకున్నారు. అఖిలభారతీయ అయ్యప్పధర్మ ప్రచార సభనుంచి 2021-22కు అయ్యప్ప పురస్కారాన్ని పొందారు. 2021లో ఏపీజే అబ్దుల్ కలాం నేషనల్ ఎక్సలెన్స్ అవార్డు, 2024లో మహాశాస్త్రా సేవా ట్రస్ట్ ఉత్తమ గురుస్వామి అవార్డులు అందుకున్నారు.

కఠిన దీక్షతోనే మనోభీష్టం నెరవేరుతుంది



35 ఏళ్లుగా అయ్యప్పస్వామి మాలాధారణతో కఠినమైన దీక్షలను పాటిస్తున్నా, ప్రతి ఒక్కస్వామి కూడా మాలాధారణతో పాటు ఇరుముడిని గురువులతోనే వేయించుకోవాలి. దీక్షలు పాటించే స్వాములు తప్పనిసరిగా సమూహంగా సన్నిధానంలో ఉండాలి. సహపంక్తి భోజనాలు చేయాలి. 41 రోజులు విధిగా దీక్షలను నిర్వహించాలి. దీక్షలలో నియమ నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తేనే భక్తుల మనోభీష్టం నెరవేరుతుంది. దీక్షా సమయాలతో పాటు 365 రోజులు కూడా నిష్ఠగా ఉండడం అలవాటు చేసుకుంటే అన్నివిధాలా శ్రేయస్కరం.

\- బొబ్బిళ్ల మురళి గురుస్వామి, చౌటుప్పల్

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి


లింగం(ఫైల్)

నాంపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా నాంపల్లి మండలంలోని కేతేపల్లి ట్రాక్టర్ ఢీకొని బైక్‌పై వెళ్తున్న వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొండమల్లేపల్లి మండలం కొత్తబాయి గ్రామానికి చెందిన పిల్లి రామలింగం(28) సెంటింగ్ పనులు చేస్తూ జీవిస్తుంటాడు. ఆయనకు భార్య అనూషతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆదివారం నాంపల్లి మండలంలోని దామెర గ్రామంలో జరిగిన శుభ కార్యానికి హాజరై తిరిగి వెళ్తుండగా కేతేపల్లి గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమర్టం నిమిత్తం తరలిస్తుండగా లింగం కుటుంబసభ్యులు కొద్దిసేపు అడ్డుకున్నారు. న్యాయం చేయాలంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దేవరకొండ ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించారు. లింగం తండ్రి బుచ్చయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శోభన్‌బాబు తెలిపారు.

కారు బోల్తా: ఇద్దరికి గాయాలు

హుజూర్‌నగర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలంలో కారు బోల్తా పడిన ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. మేళ్లచెర్వు మండలం గానుగబండకు చెందిన ఇద్దరు మైనర్లు మేళ్లచెర్వు నుంచి హుజూర్‌నగర్‌కు ఆదివారం కారులో వస్తున్నారు. వేపలసింగారంలోని మిట్టగూడెం మూలమలుపు వద్ద అతివేగంగా రావడంతో ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్‌ను తప్పించబోయి కారు అదుపుతప్పి మూడు పల్టీలు కొట్టింది. దీంతో కారులో ఉన్న ఇద్దరు మైనర్లకు గాయాలయ్యాయి. కాగా కారు నడుపుతున్న యువకులు వెంటనే కారును అక్కడి నుంచి తీసుకవెళ్లారు. కాగా ఘటనపై ఎలాంటి కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

30 టన్నుల నల్లబెల్లం స్వాధీనం


పట్టుకున్న నల్లబెల్లం లారీ, నిందితుడితో ఎక్సైజ్ సిబ్బంది

తుంగతుర్తి / తిరుమలగిరి రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) :అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లం లారీని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ రజిత తెలిపారు. ఆదివారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలోని ఎక్సైజ్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తిరుమలగిరి మండలం వెలిశాల ఎక్స్ రోడ్డు వద్ద సూర్యాపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి వాహనాలను తనిఖీ చేస్తుండగా ఎంహెచ్ 26 సీహెచ్ 0075 నెంబలర్ గల లారీలో అక్రమంగా తరలిస్తున్న 30 టన్నుల నల్లబెల్లం, క్వింటా పటిక, 20లీటర్ల నాటుసారా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. లారీలో ఉన్న గంగారామ్‌ను అరెస్టు చేశామని మరో ఇద్దరు పరారీలో ఉన్నారని తెలిపారు. తనిఖీలో టాస్క్‌ఫోర్స్ సీఐ మల్లయ్య, ఎక్సైజ్ ఎస్ఐ మూర్తి, రామకృష్ణ, సిబ్బంది ఆంజనేయులు, కొండల్, శ్రీకాంత్, ఇబ్రహీం పాల్గొన్నారు.

ఇసుక లారీ సీజ్: కేసు నమోదు

కనగల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఇసుకను అక్రమ రవాణా చేస్తున్న లారీని ఆదివారం నల్లగొండ జిల్లా కనగల్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ విష్ణుమూర్తి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కరీంనగర్ జిల్లా చొల్లూరు ఇసుక రీచ్ నుంచి అంబర్‌పేటకు ఇసుకరవాణా అనుమతులు పొంది నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలానికి రవాణా చేస్తుండగా ఆదివారం ఉదయం కనగల్‌లో పోలీసులు పట్టుకున్నారు. లారీని సీజ్ చేయడంతో పాటు డ్రైవర్ కరుణాకర్, ఓనర్ సైదులుపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	577
టీఎంసీలు	274.3640
ఎడమకాల్వకు నీటి విడుదల	8022
కుడికాల్వకు	7086
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
క్రస్ట్ గేట్ల ద్వారా	నిల్
ఎస్ఎల్‌బీసీ ద్వారా	2,400 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	300 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	28,252 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	17,808 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	44.03 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	0
అవుట్‌ఫ్లో	2000 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	644 అడుగులు
టీఎంసీలు	4.20
ఎన్ని గేట్ల ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	15.97 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	325 క్యూసెక్కులు

రోడ్డు ప్రమాదాలకు బ్రేక్ లేదా?


దేవరకొండ పెద్దదర్గా వద్ద స్పీడు బ్రేకర్లు, హెచ్చరికల బోర్డులు లేకపోవడంతో జరిగిన రోడ్డు ప్రమాదం (ఫైల్)

- రోడ్డుపై కన్పించని స్పీడు బ్రేకర్లు, సిగ్నల్స్ పాయింట్లు
- దర్గా ఉర్సు వద్ద జనంపై దూసుకెళ్లిన డీసీఎం
- ముగ్గురు అమాయకుల మృత్యువాత
- ప్రమాదాలు జరిగినప్పుడే అధికారుల హడాహుడి

దేవరకొండ, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): దేవరకొండ డివిజన్‌లో రోడ్డు ప్రమాదాలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. వాహనాల అతివేగం, స్పీడు బ్రేకర్లు, సిగ్నల్స్ పా యింట్లు లేకపోవడం కారణంగా తెలుస్తోంది. ప్రమాదా లు జరిగినప్పుడే అధికారులు, ప్రజాప్రతినిధులు సంఘటనా స్థలానికి చేరుకొని వెళుతున్నారే తప్ప నివారణ చర్య లు చేపట్టకపోవడంతో తరుచూ ప్రమాదాలు జరిగి ప్రజలు మృత్యువాత పడుతున్నారు. దేవరకొండ డివిజన్‌లో 24గంటల వ్యవధిలోనే అతివేగం, డ్రైవర్ నిర్లక్ష్యం కారణం గా నలుగురు మృతిచెందారు. ఈ నెల 21న ఉదయం 6.30 గంటల ప్రాంతంలో దేవరకొండ పట్టణ శివారు జడ్చర్ల- కోదాడ రహదారిపై హజ్రత్ ఖాదర్‌షా వలి దర్గా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు చనిపోయారు.

డీసీ ఎం దూసుకెళ్లడంతో కొబ్బరికాయలు విక్రయిస్తున్న తాటికోలుకు చెందిన ఎండి. హాజిమియా, నాగర్‌కర్నూల్ జిల్లా మేడిపూర్‌కు చెందిన అబ్దుల్ ఖాదర్, హైదరాబాద్‌కు చెందిన నబినాబేగం మృతిచెందారు. ఈ నెల 20వ తేదీన దేవరకొండ మండలం తూర్పుపల్లి వద్ద జాతీయ రహదారిపై రోడ్డు దాటుతుండగా దేవరకొండ నుంచి కల్వకుర్తివైపు అతివేగంగా వెళుతున్న కారు ఢీకొనడంతో అంకూరి ఎల్లమ్మ(55) అక్కడికక్కడే మృతిచెందింది.

మృతుల కుటుంబాలది తీరని వేదన

దీంతో ఆ కుటుంబాలు దుఃఖసాగరంలో మునిగిపోయాయి. దేవరకొండ మండలం తాటికోలుకు చెందిన ఎండీ. హాజిమియా జాతర్లు, ఉర్సు ఉత్సవాల్లో కొబ్బరికాయలు, దేవుడిపూజ సామాగ్రి, తినుబండరాలు విక్రయిస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఆయనకు భార్య జాహంగీర్‌బితోపాటు ముగ్గురు ఆడబిడ్డలు ఉన్నారు. ఆడపిల్లల వివాహ లయ్యాయి. కుటుంబానికి పెద్దదిక్కైన హాజిమియా మృతిచెందడంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా మేడిపూరుకు చెందిన అబ్దుల్ ఖాదర్(19) అన్వర్‌పాషకు ఒక్కగానొక్క కొడుకు. రోడ్డు ప్రమాదంలో అబ్దుల్ ఖాదర్ మృతిచెందగా, అన్వర్‌పాష కాలు విరిగింది. ఉర్సు ఉత్సవాలకు వచ్చి ఒక్కగానొక్క కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో తల్లిదండ్రులు దుఃఖసాగరంలో మునిగిపోయారు. ఉర్సు ఉత్సవాలకు వచ్చిన హైదరాబాద్ చంపాపేటకు చెందిన నబినాబేగం(25) రోడ్డు ప్రమాదంలో మృతిచెందింది. తల్లి కేమైందని ఆమె ఇద్దరు చిన్నారులు అడుగుతుండడం అక్కడున్న వారు కంటతడి పెట్టారు. నబినాబేగం మృతి చెందడంతో భర్త ఖాదర్‌పాష కన్నీటి పర్యంతమవుతున్నాడు. స్పీడ్ బ్రేకర్లు లేకపోవడమే పెద్ద దర్గా వద్ద ప్రమాదం జరగడానికి కారణమని బాధితుల బంధువులు తెలిపారు. దర్గా వద్ద స్పీడు బ్రేకర్లతోపాటు హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

దేవరకొండ మండలం కొండభీమనపల్లి, దేవరకొండ పట్టణంలోని ఎంకేఆర్ ఆర్చి వద్ద తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. నెల రోజుల క్రితం ఎంకేఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థి భీముడు కళాశాలకు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా కల్వకుర్తి నుంచి అతివేగంగా వచ్చిన డీసీఎం వాహనం ఢీకొనడంతో మృతిచెందాడు. మూడు నెలల క్రితం కొండభీమనపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో జంగయ్య అనే రైతు మృతిచెందాడు. అతివేగాన్ని అరికట్టే విధంగా చర్యలు తీసుకొని స్పీడు బ్రేకర్లు, ప్రమాదాల హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


స్పీడు బ్రేకర్లు ఉంటే ప్రమాదం జరిగేది కాదు



దేవరకొండ పెద్దదర్గా వద్ద స్పీడు బ్రేకర్లు, హెచ్చరికల బోర్డులు ఉంటే రోడ్డు ప్రమాదం జరిగి ఉండేది కాదు. స్పీడు బ్రేకరు లేకపోవడంతోనే డీసీఎం డ్రైవర్ అతివేగంగా వచ్చి ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. స్పీడు బ్రేకర్లు, ప్రమాద హెచ్చరికల బోర్డులు ఏర్పాటుచేసి అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలి.

- దస్తగిరి, ఎర్రారం

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపడతాం



రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపడతాం. తరుచూ తనిఖీలు చేస్తున్నాం. హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేస్తాం. అతివేగంగా, అజాగ్రత్తగా వాహనాలు నడిపిన వారిపై చర్యలు చేపడతాం.

- నర్సింహులు, దేవరకొండ సీఐ.

నాయకుల నోట గందమల్ల మాట

- గందమల్లపై అసెంబ్లీలో చర్చ
- ఆలేరు ప్రజల్లో చిగురిస్తున్న ఆశలు


గందమల్ల చెరువు

తుర్కపల్లి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఎంతో కాలంగా ఆలేరు ప్రజలు సాగు, తాగు నీటిస్తున్న ఎదురు చూస్తున్న గందమల్ల ప్రాజెక్టుపై ఆశలు చిగురిస్తున్నాయి. 20 ఏళ్లుగా ఏ ఎన్నికలొచ్చినా ఏ పార్టీ అయినా మొట్ట మొదటగా ఆలేరు ప్రజలకు నాయకులు హామీ ఇచ్చేది గందమల్ల ప్రాజెక్టుపైనే. గందమల్ల రిజర్వాయర్ నిర్మాణంపై ఆలేరు ప్రజల సాగు, తాగు నీటి వనరు అయిన గందమల్ల ప్రాజెక్టుకు నిధులు వెచ్చించి పూర్తి చేయాలని శాసన మండలి, శాసన సభలో నాయకులు సభా దృష్టికి తీసుకురావడంపై ప్రజలు హర్షిస్తున్నారు. ఉభయ సభల్లో కాంగ్రెస్ నాయకులు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సభా దృష్టికి తీసుకొచ్చారు. రెండు రోజులుగా గందమల్లపై చర్చ జరగడంతో సాగు నీటి ప్రాజెక్టు పనులు ప్రారంభమవుతాయని, గందమల్ల కింది రైతులు ఆశతో ఎదురు చూస్తున్నారు. ఆలేరు, రాజాపేట, గుండాల, యాదగిరిగుట్ట, తుర్కపల్లి, మోత్కూర్, తిరుమలగిరి మండలాల్లోని రైతులకు ఎంతో ప్రయోజనంగా ఉండి వేల ఎకరాలు సాగులోకి రానున్నాయి. ఇటీవల గోదావరి జలాలతో గందమల్ల చెరువును నింపి కింది ప్రాంతానికి నీటిని వదలడంతో ఆలేరు. గుట్ట, రాజాపేట, గుండాల, కొన్ని చెరువులను ఈ నీటితో నింపారు. గందమల్ల చెరువు నుంచి బేగంపేట, రఘునాథపురం, కొలనుపాక, ఆలేరు, గుండాల మండలాలతో అనుసంధానంగా ఉన్న వాగులో నీరు పారడంతో వాగుకు ఇరువైపులా ఉన్న బోర్లు, బావుల్లో నీటి ఊటలు పెరిగాయి. భూగర్భ జలాలు పెరగడంతో వర్షాలు తక్కువగా కరిసినా నీటి సమస్య లేకుండా పోయింది. అసెంబ్లీలో నాయకుల నోట గందమల్ల మాట రావడంతో గందమల్ల ప్రాజెక్టుపై ఆశలు సజీవంగా ఉన్నాయని స్థానిక ప్రజలు పేర్కొంటున్నారు. గందమల్ల ప్రాజెక్టును పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

ప్రజల కల నెరవేరనుంది



ఎన్నో ఏళ్ల పోరాటం.. ఎన్నో ఏళ్ల రైతుల సాగునీటి కల నెరవేరనున్నది. రాష్ట్రం నుంచి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య గందమల్ల ప్రాజెక్టుపై శాసన సభలో ప్రస్తావించి సభా దృష్టికి తేవడం హర్షనీయం. వారికి మా ఆలేరు ప్రజల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు. సాగు, తాగు నీటి సమస్య గందమల్లతోనే తీరుతుంది. ఆలేరులో బీడు భూములన్నీ సస్యశ్యామలం అవుతాయి.

-వంచ వీరారెడ్డి, మాజీ సర్పంచ్ చల్లూరు, రాజాపేట (మండలం)

చలించిన పేగు బంధం

- కిడ్నీ దెబ్బతినడంతో కుమార్తెకు ఆరోగ్యసమస్యలు
- కుమార్తెకు తండ్రి కిడ్నీ దానం


పులగం సుదర్శన్, కిడ్నీ దానం చేసిన తండ్రి (ఇన్‌సెట్లో) ఆమని, కిడ్నీ పొందిన కుమార్తె

యాదగిరిగుట్ట రూరల్, డిసెంబరు 22 (ఆంధ్యజ్యోతి): కన్న బిడ్డలు ఆపదలో ఉంటే తల్లిదండ్రుల మనస్సు వికలమైపోతుంది. బిడ్డలపై వారికి ఎనలేని మమకారం ఉంటుంది. ప్రాణాపాయంలో ఉన్న కుమార్తె కోసం ఓ తండ్రి తనకిడ్నీని దానమిచ్చాడు. తనకు వయస్సు మీద పడినా కుమార్తె భవిష్యత్ కోసం తన ప్రాణాన్ని ఫణంగా పెట్టాడు యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన పులగం సుదర్శన్. తండ్రికి పిల్లలపై ఎంత ప్రేమ ఉంటుందో చాటిచెప్పిన ఉదంతమిది. యాదగిరిగుట్ట పట్టణ కేంద్రానికి చెందిన పులగం సుదర్శన్(58) వృత్తిరీత్యా 40ఏళ్లుగా టైలరింగ్ చేస్తుండటంతో ఆయన్ను పులగం టైలర్ అని పిలుస్తుంటారు. సుదర్శన్, ప్రమీల దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. చిన్నకుమార్తె ఆమనికి వివాహం కాగా ఇద్దరు సంతానం ఉన్నారు. ఆమని భర్త హైదరాబాద్‌లో జనరల్ స్టోర్ నడుపుతూనే, ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నాడు. ఈ ఏడాది ఏప్రిల్‌లో విపరీతమైన కాళ్ల వాపులు, శ్వాస ఆడకపోవడం, దమ్ము, ఆయాసంతో ఆమని ఇబ్బంది పడింది. దీంతో ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి పరీక్షలు చేయించుకోగా కిడ్నీ దెబ్బతిన్నదని, డయాలసిస్ తప్ప మరోమార్గం లేదని తేల్చి చెప్పారు. అదే సమయంలో కొత్త కిడ్నీ అవసరమని, ఇందుకోసం పెద్దమొత్తంలో ఖర్చవుతుందని తెలిపారు. ఎన్నిసార్లు చికిత్స చేయించినా ఆమని సమస్య తీరకపోగా, రోజు రోజుకూ ఆరోగ్య సమస్యలు చుట్టుముట్టాయి. ఈ తరుణంలో కుటుంబ సభ్యుల్లో ఎవరైనా కిడ్నీ దానం చేస్తే అమర్చుతామని, కానీ ఖచ్చితంగా సఫలం అవుతుందని చెప్పలేమని వైద్యులు తేల్చిచెప్పారు.

అయినప్పటికీ తన కుమార్తె కోసం కిడ్నీ దానం చేసేందుకు తండ్రి సుదర్శన్ ముందుకువచ్చాడు. పేగుబంధాన్ని కాపాడుకోవటానికి తన కిడ్నీ ఇస్తానని చెప్పారు. వైద్యపరీక్షల అనంతరం తండ్రి సుదర్శన్ కిడ్నీని కుమార్తె ఆమనికి సరిపోతుందని,అమర్చేందుకు వీలవుతుందని వైద్యులు నిర్ధారించారు. ఈ ఏడాది జూలై 27 తేదీన శస్త్రచికిత్స చేసి కిడ్నీని ఆమనికి అమర్చారు.

శస్త్రచికిత్స అనంతరం మూడు నెలల తర్వాత యధావిధిగా సుదర్శన్ తన టైలరింగ్ పనుల్లో నిమగ్నమయ్యాడు. శస్త్రచికిత్స పూర్తయి సుమారు ఐదు నెలలు కావస్తుండగా, ఇద్దరూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా సంతోషంగా ఉన్నారు. తన కుమార్తెకు కిడ్నీ దానం చేసి బతికించుకున్నందుకు సుదర్శన్‌కు చెప్పలేని ఆనందం కలిగింది. కన్న కుమార్తెకు కిడ్నీ దానం చేసి సమాజంలో మానవ సంబంధాలు, ఆత్మీయత అనురాగాలకు అర్థం చెప్పిన గొప్పవ్యక్తిగా సుదర్శన్‌ను ప్రతి ఒక్కరూ అభినందిస్తున్నారు.

కుమార్తె జీవితం కన్నా ఎక్కువేముంది



ఆమని కిడ్నీ సమస్యతో ఇబ్బందిపడటం బాధించింది. తండ్రిగా తట్టుకోలేకపోయా. నా కిడ్నీ సరిపోతుందని వైద్యులు తెలపడంతో ఇచ్చేందుకు సిద్ధపడ్డా. బిడ్డ ప్రాణం కన్నా నా కిడ్నీ విలువైందేమి కాదు. ఇప్పుడు ఇద్దరం సంతోషంగా ఉన్నాం. నా పనిని నేను చేసుకోగలుతున్నా.

- పులగం సుదర్శన్, తండ్రి, కిడ్నీ దాత

నా తండ్రి రుణం ఎలా తీర్చుకోవాలో



కిడ్నీ దానం చేసి తనకు పునర్జన్మని ప్రసాదించిన తండ్రి సుదర్శన్ రుణం ఎలాతీర్చుకోవాలో. తన పిల్లలు, కుటుంబాన్ని దృష్టిలో పెట్టుకొని కిడ్నీ దానం చేసి దేవుడిలా రక్షించారు. ఆయన్ను దేవుడిలా ఆరాధిస్తా.

- ఆమని, కుమార్తె

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో మొదటి స్థానం

హుజూర్‌నగర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన ఎస్సీ గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. కొత్తగూడెం జిల్లా పాల్వంచలో ఈ నెల 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు జరిగిన టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ పదో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో గురుకుల పాఠశాల విద్యార్థులు అండర్-17 ఐదో జోన్‌లో మొదటిస్థానం సాధించారు. కబడ్డీ విభాగంలో బెస్ట్ రైడర్‌గా నరేందర్, బెస్ట్ ఆల్‌రౌండర్‌గా చంద్రహరితేజ్ నిలిచారు. అండర్-17 అథ్లెటిక్స్ లాంగ్, 200 మీటర్ల పరుగు పందెంలో ప్రవీణ్ గోల్డ్ మెడల్ సాధించాడు. అండర్-14 క్యారమ్ విభాగంలో నితిన్ సిల్వర్ మెడల్ సాధించారు. రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో ప్రవీణ్, నితిన్‌లు గోల్డ్‌మెడల్ సాధించి గురుకుల పాఠశాలకు గుర్తింపు తెచ్చారు.

అవార్డులు, పదవులకు వన్నె తెవాలి : ప్రజా సంఘాలు

భువనగిరి గంజ్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మహనీయుల స్ఫూతో అవార్డులు, పదవులకు వన్నె తీసుకురావాలని ప్రజా సంఘాల నాయకులు అన్నారు. ఇటీవవల ఢిల్లీలో హ్యూమన్ రైట్స్ డిఫెండర్ జాతీయ అవార్డు పొందిన సురుపంగ శివలింగం, భువనగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ కనుకుంట్ల బాబురావు, పచ్చలకట్ట సోమేశ్వర ఆలయ చైర్మన్ కొల్లూరి రాజుకు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక జగ్జీవన్‌రామ్ భవనంలో ఆదివారం ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ జ్యోతీరావు పూలే, బాబాసాహెబ్ అంబేడ్కర్, జగ్జీవన్ రామ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటుకల దేవేందర్, పూలే అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ బానోత్ భాస్కర్‌నాయక్, దళిత ఐక్య వేదిక చైర్మన్ బట్టు రాంచంద్రయ్య, మార్కెట్ మాజీ చైర్మన్ పోత్నక్ ప్రమోద్‌కుమార్, మాజీ మునిసిపల్ చైర్మన్ జహంగీర్, శ్రీనివాస్, నరసింహ పాల్గొన్నారు.

హరితహారం పురోగతిలో ఫీల్డ్ అసిస్టెంట్ల పాత్ర కీలకం

భువనగిరి రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీల అభ్యున్నతి, హరిత హారం కార్యక్రమ పురోగతిలో ఫీల్డ్ అసిస్టెంట్ల పాత్ర కీలకమని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకుడు కంకల సిద్దిరాజు అన్నారు. ఆదివారం భువనగిరిలో జిల్లా స్థాయి ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా బబ్బూరి శంకర్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా బైరగోని రమేశ్ , కోశాధికారిగా జేరిపోతుల ఉపేందర్, ఉపాధ్యక్షులుగా వెంకటేశ్, నరేందర్, భిక్షు నాయక్, నర్సింహులును ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా బ బ్బూరి శంకర్ గౌడ్ మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లు చాలిచాలని వేతనాలతో జీవితం గడుపుతున్నారని ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలలని కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్లు ఐక్యంగా సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. తన ఎన్నికకు సహకరించిన జిల్లా ఫీల్డ్ అసిస్టెంట్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్ఎస్‌లో సంస్థాగతమెప్పుడో?

(5వపేజీ తరువాయి)

సంస్థాగతంగా జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ కమిటీలను పునరుద్ధరించనున్నట్లు గతంలోనే బీఆర్ఎస్ ప్రకటించింది. సంస్థాగతంగా పార్టీ తరపున తీసుకునే నిర్ణయాలు, కార్యకలాపాలు కూడా జిల్లా కమిటీలకే పూర్తి బాధ్యత ఇచ్చింది. జిల్లాస్థాయిలో ఏర్పాటుచేసిన కమిటీలు అధిష్ఠానం సూచన మేరకు పనిచేస్తాయని, స్థానికంగా ఉండే ఎమ్మెల్యేలు, ఎంపీల ఒత్తిడి, పెత్తనం ఉండదని గతంలో పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. జిల్లాలో తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన సీనియర్ నేతలతో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు జిల్లా అధ్యక్షులుగా అధిష్ఠానం ప్రకటించింది. అయితే కార్యవర్గం లేకుండానే సుమారు రెండేళ్లుగా ఏకపక్షంగా అధ్యక్షుడు, మండల కమిటీలతోనే పార్టీ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

అనుబంధ కమిటీలు ప్రకటించని వైనం

బీఆర్ఎస్ 2022 జనవరి 26న జిల్లా అధ్యక్షులను ప్రకటించింది. జిల్లా అధ్యక్షుల నియామకాలను సైతం చాలా కాలం వాయిదా వేసి జనవరి 26న పార్టీ అధినేత కేసీఆర్ ఎట్టకేలకు 33 జిల్లాలకు అధ్యక్షులను ప్రకటించారు. ఆ తర్వాత పూర్తిస్థాయి కార్యవర్గం లేదు. పార్టీ జిల్లా అధ్యక్షులు బాధ్యతలు తీసుకున్న అనంతరం పార్టీ అధిష్ఠానంతో చర్చిస్తున్న పలు సందర్భాల్లో జిల్లా కార్యవర్గాన్ని పూర్తిస్థాయిలో నియమించాలని, లేనిపక్షంలో కనీసం పార్టీ అనుబంధ జిల్లా అధ్యక్షులను ప్రకటించాలని అధినేతను కోరారు. అయితే అధిష్ఠానం మాత్రం ఇంతకాలం జిల్లా అధ్యక్షుడితోనే నెట్టుకొని వచ్చింది. బీఆర్ఎస్‌గా అవతరించిన అనంతరం కూడా సంస్థాగత పదవులు పొందలేకపోయామని ఇంతకాలం పార్టీలో ఉన్న నేతల్లో అసంతృప్తి ఉంది. అయితే త్వరలోనే పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ఏర్పాటు చేయాలని పార్టీ నిర్ణయించినట్లు తెలిసింది.

యాదగిరి క్షేత్రంలో భక్తుల సందడి

- నిత్యాదాయం రూ.57.52 లక్షలు

భువనగిరి అర్బన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి కొండ ఆదివారం భక్తులతో సందడిగా మారింది. వారాంతపు సెలవు రోజు కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వాహనాలపై తరలివచ్చారు. కొండపైన, కింద పార్కింగ్ ప్రదేశాలు నిండిపోవడంతో పాటు వైకుంఠ ద్వారం ఇరువైపులా వాహనాలు నిలిపారు. సుమారు 55వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు అధికారులు తెలపగా ఉభయ క్యూలైన్లల్లో ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు బారులు తీరారు. వీఐపీ టికెట్ దర్శనానికి గంట, ఉచిత దర్శనాలకు రెండు గంటల సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు. ప్రధానాలయం, కల్యాణోత్సవ మండపం, ఆలయ తిరువీధులు, ప్రసాద విక్రయశాల, కొండపైన కింద బస్టాండ్లు, లక్ష్మీ పుష్కరిణి, కల్యాణ కట్ట వద్ద కూడా భక్తుల సందడి నెలకొంది. భక్తులను కొండపైకి తరలించేందుకు రద్దీకి తగినట్లు బస్సులను అధికారులు ఏర్పాటు చేశారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.57,52,702ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు. కాగా, స్వామివారి గాలి గోపురానికి స్వర్ణ తాపడానికి హన్మకొండకు చెందిన భక్తులు వాకా సత్యనారాయణ జయలలిత దంపతులు రూ. 5,01,116 నగదు ఈవోకు అందజేశారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు గోదాదేవి అమ్మవారికి ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు చేపట్టగా మహిళ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.


తూర్పు రాజగోపురం వద్ద ఉభయ క్యూలైన్లలో భక్తుల రద్దీ

శాస్త్రోక్తంగా నిత్య పూజలు

సుప్రభాత సేవతో స్వామి అమ్మవార్లను మేల్కొపిన అర్చకులు స్వయంభువులకు నిత్యపూజలు సంప్రదాయరీతిలో నిర్వహించారు. గర్భాలయంలో స్వయంభువులకు అభిషేకం, అర్చనలు, ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణోత్సవ పర్వాలు వైభవంగా చేపట్టారు. పాతగుట్ట స్వామి అమ్మవారికి నిత్య పూజలు ఘనంగా చేపట్టారు. కొండపైన శివాలయంలో శ్రీ పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామివారికి నిత్య పూజలు, రుద్రహవన పూజలు, శైవాగమరీతిలో జరిపారు. రాత్రి మహానివేదన, శయనోత్సవాలతో ఆలయ ద్వార బంధనం చేశారు.



నిత్య కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు, కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

రాజాపేటకు చేరుకున్న సైకిల్ యాత్ర

రాజాపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): హిందూ రాష్ట్ర సాధనకు, జ్యోతిర్లింగాల దర్శనం కోసం ఇద్దరు యువకులు సిద్దయ్యస్వామి, కతం రాజేశ్వర్ చేపట్టిన సైకిల్ యాత్ర ఆదివారం రాజాపేటకు చేరుకుంది. జైశ్రీమ్ ఫౌండేషన్ సభ్యులు ఘనంగా స్వాగతం పలికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆరు నెలల క్రితం చేపట్టిన యాత్ర 10వేల కిలోమీటర్లకు చేరుకుందని స్వామి, రాజేశ్వర్లు తెలిపారు.

సమాచారం

నేడు ఎమ్మెల్యే రాక

అడ్డగూడూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): అడ్డగూడూరు ఎంపీడీవో కార్యాలయంలో కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఈనెల 23వ తేదీన తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు హాజరుకానున్నారు. ఈ మేరకు స్థానిక తహశీల్దారు అమనగంటి శేష గిరిరావు ఒక ప్రకటనలో తెలిపారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత

అడ్డగూడూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): లక్ష్మీదేవికాల్వకు చెందిన దుంపల వెంకన్న కుటుంబానికి పదో తరగతి స్నేహితులు చేయూతనందించారు. ఇటీవల వెంకన్న మృతిచెందగా, ఆయన చిత్రపటానికి నివాళులర్పించి రూ.15వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వరప్రసాద్, ఆశోక్, సురేష్, రమేష్, సురేష్, శివకృష్ణ, యాదగిరి, శంబయ్య పాల్గొన్నారు.

కనుముకుల గ్రామంలో

భూదాన్‌పోచంపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కనుముకుల గ్రామంలో ఇటీవల మృతి చెందిన దేవరపల్లి మోహన్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన రెడ్డి యువజన సంఘం నాయకులు ఆదివారం రూ. 20వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డి యువజన సంఘం నాయకులు కోట రమణారెడ్డి, కోట అజిత్‌రెడ్డి, కోట మధుసూదన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కోట శ్రీనురెడ్డి, కోట రంగారెడ్డి, దేవరపల్లి జంగారెడ్డి, కోట అనిల్‌రెడ్డి, కోట ప్రకాష్‌రెడ్డి, కూనుకుంట్ల రమేష్‌రెడ్డి, కోట మహేందర్‌రెడ్డి, సామల లింగారెడ్డి, కోట ప్రదీప్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత రక్తదాన శిబిరం

భూదాన్‌పోచంపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మహమ్మాయి నగర్ కాలనీలోని ఎంఎం యువజన సంఘం సభ్యులు ఆదివారం ఎంఎస్ఎన్ బ్లడ్ బ్యాంకు సౌజన్యంతో ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బాత్క లింగస్వామియాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 45 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం గౌరవాధ్యక్షులు బోగ భానుప్రకాష్, అధ్యక్షులు అల్లి ఉదయ్‌కిషోర్, ఉపాధ్యక్షులు బాలిని ధనుంజయ, ప్రధాన కార్యదర్శి చిట్టిపోలు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల అందజేత

వలిగొండ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దటూరులో ఇటీవల అగ్నిప్రమాదంతో నష్టపోయిన బత్తుల స్వప్న కుటుంబానికి జై కేసారం ఆదిత్య మెడికల్, సమిష్టి సేవా ఫౌండేషన్ సహకారంతో నిత్యవసర సరుకులను ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్యులు మైలారం రాజు, పొట్ట రాఘవేంద్ర, బత్తుల మహేష్, బోళ్ల శేఖర్, అశోక్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

భారీ బహిరంగ సభకు తరలిరావాలి

రామన్నపేట,డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సీపీఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా నల్లగొండలోని ఎన్‌జీ కళాశాల మైదానంలో ఈనెల 30న నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి ఊట్కూరి నర్సింహ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

కార్పొరేట్ హాస్టళ్లకు దీటుగా..

- యాదగిరిగుట్ట బాలికల ఎస్సీ హాస్టల్
- మెనూ పెంపుపై విద్యార్థుల హర్షం

యాదగిరిగుట్ట రూరల్, డిసెంబరు 22, (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ రెసిడెన్షియల్ హాస్టళ్లకు దీటుగా సంపూర్ణ సౌకర్యాలతో సమగ్ర విద్యా వసతి విద్యా సంస్థలుగా అనే కీర్తిని ప్రభుత్వ బాలికల ఎస్సీ వసతిగృహాలు పొందుతున్నాయి. ఆ కోవనే యాదగిరిగుట్ట పట్టణంలోని బాలికల ఎస్సీ హాస్టల్ పేద మధ్యతరగతి వర్గాలకు చెందిన బాలికలకు కొండంత అండగా మారింది. సంపూర్ణ సౌకర్యాలతో ఉన్నత పలితాలు సాధించేందుకు పటిష్టమైన ప్రారంభ పునాదిగా ఈ వసతిగృహం తోడ్పుతోంది. పచ్చదనం పరిశుభ్రత చక్కటి వాతావరణం ఆహ్లాదం కలిగిస్తోంది. పచ్చని మొక్కలతో కనువిందు చేస్తోంది. చక్కటి గదుల్లో ఫ్యాన్లు, లైట్లు, బెడ్స్ ఉన్నాయి. 1989 సంవత్సరంలో ఈ హాస్టల్‌ను ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు 14మంది మేట్రిన్లు విధులు నిర్వహిస్తుండగా ప్రస్తుతం 96మంది విద్యార్థులతో కొనసాగుతున్న హాస్టల్‌కు మేట్రిన్‌గా సోని విధులు నిర్వహిస్తున్నారు. ప్రతీరోజు మెనూ ప్రకారం ఉదయం పులిహోర, ఇడ్లీ, రాగి సంకటి, కిచిడీ వీటిలో ఏదో ఒకటి అందిస్తారు. సాయంత్రం స్నాక్స్ ఫ్రూట్స్, బిస్కెట్లతో పాటు రాత్రి కూరగాయలతో చేసిన కర్రీ, పప్పు, సాంబార్‌తో వారికి ప్రత్యేకంగా టేబుళ్లతో ఏర్పాటు చేసిన డైనింగ్ హాల్‌లో చక్కగా భోజనం అందిస్తారు. ప్రస్తుతం మెస్, కాస్మెటిక్ చార్జీలు పెరగడంతో విద్యార్థులు సంతోషంగా ఉన్నారు. చలికాలంలో పిల్లలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం వారికి ఉచితంగా స్వెటర్లను సైతం అందజేసింది. ప్రతీరోజు స్థానిక మేట్రిన్ ఉదయం 5గంటలకు విద్యార్థుల లేపి వారితో పాటుగా ఉంటూ గంటసేపు వారిని చదివించి యోగాసానాలు వుయిస్తారు. దినచర్యలు ముగించుకుని పిల్లలు ప్రతీరోజు మాదిరిగానే అల్పాహారం భుజించుకొని పాఠశాల దూరంగా ఉండటంతో వారికి ఆర్టీసీ అధికారులు ఉచితంగా పాఠశాల వరకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సులో వెళ్లి సాయంత్రం అదే బస్సులో తిరిగివస్తారు.


హాస్టల్‌లో భోజనం చేస్తున్న విద్యార్థినులు

అమ్మలా చూసుకుంటున్నారు



హాస్టల్‌లో మాకు అమ్మలేని లోటును మా మేట్రిన్ తీర్చుతున్నారు. చక్కని భోజనంతోపాటుగా పౌష్టికరమైన ఆహారం అందిస్తున్నారు. విద్య విషయంలో మాకు ఎమైనా సందేహాలు వస్తే వాటిని అర్థమయ్యే చెబుతూ తోడ్పాటెరె అందిస్తున్నారు.

-విద్యార్థి శృతి, 8వ తరగతి

మెస్‌చార్జీలపెంపు సంతోషకరం



ప్రభుత్వం మెస్‌చార్జీలు పెంచడంతో సంతోషంగా ఉంది. గతంలో వారంలో 3అరటిపడ్లకు బదులుగా 5అరటిపండ్లు , 5గుడ్లు వారంలో ఒక రోజు చికెన్, ప్రతీరోజు రకరకాల కూరగాయాలతో చక్కని భోజనం అందిస్తున్నారు. మా వంటమనుషులు చక్కగా భోజనం అందిస్తున్నారు.

--సాయినిఖిత, 10వ తరగతి


పిల్లల అభిమానం సంతోషంగా ఉంది



పిల్లలు నాపై చూపిస్తున్న అభిమానం నమ్మలేని విధంగా ఉంది. ఇప్పటి వరకు పిల్లలకు విద్యతో పాటు ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు తీసుకుంటున్నాం. స్థానిక మెడికల్ ఆఫీసర్‌తో నెలలో రెండు మూడు సార్లు హాస్టల్‌కు వచ్చి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇస్తారు. పిల్లల నమ్మకాన్ని వమ్ముచేయకుండా వారికి అండగా ఉంటా.

-సోని, మేట్రిన్

సమస్యలన్నీ పరిష్కరిస్తా



స్థానిక బాలికల ఎస్సీ హాస్టల్‌లోని సమస్యలన్నీ పరిష్కరిస్తాను. పరిసరాల పరిస్థితి, పరిశుభ్రత, వంటకాలు, పచ్చని మొక్కలు, చెట్లు విద్యార్థులలో క్రమశిక్షణ బాగుంది. మేట్రిన్ కృషి అభినందనీయం. విద్యార్థులకు కావాల్సిన సోలార్ గీజర్, కోతులు రాకుండా ఫెన్సింగ్, తప్పకుండా ఏర్పాటు చేయిస్తాను.

-బీర్ల అయిలయ్య, ప్రభుత్వ విప్

పిల్లలు స్నానం చేయడానికి ఉదయం నీళ్లు చల్లగా ఉండటంతో ఇబ్బందులు పడుతున్నారు. కోతుల బెడద ఎక్కువగా ఉంది. ప్రతీరోజు కోతులు అనేక ఇబ్బందులు పెడుతున్నాయి. ప్రస్తుతం వారికి సోలార్ గీజర్, ప్రహరీగోడ చుట్టూ కోతులు రాకుండా సోలార్ ఫెన్సింగ్ వేయించి రక్షణ కల్పించాల్సి ఉంది.



పచ్చని చెట్ల మధ్యన ఎస్సీ బాలికల హాస్టల్ భవనం, సామూహికంగా చదువుకుంటున్న విద్యార్థినులు

గృహజ్యోతి లబ్ధిదారులు పెరిగారు

(5వపేజీ తరువాయి)

వరకు 1,44,780 మంది లబ్ధి పొందారు.

10 నెలలకు రూ.41.59కోట్ల సబ్సిడీ

గృహజ్యోతి ప్రారంభమైన 10 నెలలుగా 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించిన జిల్లాలోని 1,44,780 మంది వినియోగదారులకు రూ.41,59,61,982 సబ్సిడీ లభించింది. పథకం ప్రారంభమైన మార్చి నుంచి నవంబరు వరకు క్రమేపీ లబ్ధిదారులు, సబ్సిడీ పెరిగింది. అయితే డిసెంబరులో మాత్రం అదే క్రమంలో లబ్ధిదారుల సంఖ్య పెరిగినా సబ్సిడీ మాత్రం తగ్గింది. క్రమేపీ చలి పెరుగుతున్న నేపథ్యంలో పలువురు వినియోగదారులు ఇళ్లలో వేడి నీళ్ల కోసం హీటర్లు, గీజర్లను వాడుతుండడంతో డిసెంబరు మాసానికి లబ్ధిదారుల సంఖ్య పెరిగినా, ఇతర వినియోగదారుల విద్యుత్ వినియోగం పెరగడంతో సబ్సిడీ తగ్గినట్టు ట్రాన్స్‌కో సిబ్బంది పేర్కొంటున్నారు.

క్రాంతినగర్ పద్మశాలి సంఘం నూతన కమిటీ ఎన్నిక

ఆలేరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆలేరు పట్టంలోని క్రాంతినగర్‌కు చెందిన పద్మశాలీలు ఆదివారం సమావేశమై నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మెరుగు శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా అమృతం నర్సింహులు, ఉపాధ్యక్షుడిగా ఎలగందుల యాకస్వామి, చింతకింది మార్కొండయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కందగట్ల నరేందర్, చిలుకు చేనేత సహకార సంఘం చైర్మన్ చింతకింది మల్లేష్, నాయకులు ఎలగందుల సురేష్, బడుగు జహంగీర్ పాల్గొన్నారు.

సేంద్రియ రైతుకు పుడమి పుత్ర అవార్డు

మోత్కూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మోత్కూరు మునిసిపాలిటీ కేంద్రంలో సేంద్రియ వ్యవసాయం చేస్తున్న రైతు బిల్లపాటి గోవర్ధన్‌రెడ్డికి 'పుడమి పుత్ర' అవార్డు లభించింది. ఆదివారం యాదగిరిగుట్టలోని రెడ్ల సంక్షేమ సంఘం హాల్‌లో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ-గాంధీజ్ఞాన్ ప్రతిష్టాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయన ఈ అవార్డు అందుకున్నారు.

కన్నుల పండువగా అయ్యప్ప పడి పూజ

తుర్కపల్లి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): తుర్కపల్లి మండల కేంద్రంలో అయ్యప్ప స్వామి మహాపడి పూజను కన్నుల పండువగా నిర్వహించారు. సీఎం సీపీఆర్‌వో బోరెడ్డి అయోధ్యరెడ్డి స్వగృహంలో ఆదివారం పీఎం మనోజ్ తంత్రి గురుస్వామి, పెండెం శ్రీనివాస్ గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహాపడి పూజను అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామి 18 మెట్లను పూల మాలలతో అలంకరించి గణపతి, కుమార స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించి, ఉదయం గణపతి పూజతో ప్రారంభించి, సుదర్శన హోమం, శ్రీ సుబ్రహ్మణ్య స్వామి, కలశం, అమ్మవారి పూజలు నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వామికి 18 రకాల అభిషేకాలు, ఆభరణాల ఊరేగింపు నిర్వహించి పడిపూజ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప నామస్మరణంతో ఈ ప్రాంతమతా మారుమోగింది. కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అయ్యప్ప భక్తులు, భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో గురు స్వాములు పత్తిపాటి హనుమంతరావు, పత్తి పాటి రామారావు, బొట్టు గురుస్వామి, తిప్పారం నాగ, పత్తిపాటి ఆనంద్, పత్తిపాటి సునీల్, బోడ నవీన్, తిప్పారం బ్రహ్మచారి, పుట్ట ఆంజనేయులు, పుట్ట అంజనేయులు, మడిగె వెంకటస్వామి, శాగర్ల పరమేశ్, కూరెళ్ల సందీప్ బండారి కనకరాజుతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి అయ్యప్ప స్వాములు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సీఎం సీపీఆర్‌వో బోరెడ్డి అయోధ్యరెడ్డి స్వగృహంలో ఆదివారం పీఎం మనోజ్ తంత్రి గురుస్వామి, పెండెం శ్రీనివాస్ గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి మహాపడి పూజలో ప్రముఖ కవి అందె శ్రీ పాల్గొన్నారు.


తుర్కపల్లి: పడిపూజలో పాల్గొన్న అయోధ్యరెడ్డి

దైవ చింతన అలవర్చుకోవాలి

యాదగిరిగుట్ట రూరల్: దైవ చింతన ప్రతీ ఒక్కరు అవర్చుకోవాలని ప్రభుత్వవిప్ బీర్ల అయిలయ్య అన్నారు. ఆదివారం గుట్ట మండలంలోని చొల్లేరు గ్రామంలో అయ్యప్ప స్వాముల ఇరుముడి పడిపూజలో ఆయన పాల్గొన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కానుగు బాలరాజ్‌గౌడ్, మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం పాల్గొన్నారు.

స్వర్ణగిరిలో భక్తుల సందడి

భువనగిరి టౌన్: భువనగిరి పట్టణ శివారులోని స్వర్ణగిరి ఆలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. ధర్మదర్శనానికి భక్తులు గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉన్నారు. సుప్రభాత వేంకటేశ్వర స్వామికి సుప్రభాత సేవలు నిర్వహించగా గోదా దేవి అమ్మవారికి పంచామృతాభిషేక సేవలు నిర్వహించారు. ఆలయ వీధుల్లో మేళ తాళాలతో సారే ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి సమర్పించారు. సువర్ణ భరిత వజ్రాభరణాలతో స్వామి వారు అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చాడు. భువనగిరి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.ఉషాశ్రీ కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శనం చేసుకొని తులాభారంతో మొక్కులు చెల్లించుకున్నారు.


ఆలయ వీధుల్లో అమ్మవారి సారె ఊరేగిస్తున్న అర్చకులు

మహనీయుల ఆశయాలతో ముందుకు..


విగ్రహాల ఆవిష్కరణలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, మహిళా అభివృద్ధి సహకార సంస్థ చైర్మన్ బండి శోభారాణి

రాజాపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మహనీయుల ఆశాయాలతో ముందుకు నడుద్దామనీ అభివృద్ధిలో ముందుందామని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. ఆదివారం రాత్రి రాజాపేట మండలం కొత్తజాల గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతీయ విగ్రహావిష్కరణ వారు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరికి ఓటు హక్కును కల్గించిన ఘనత రాజ్యాంగా నిర్మాత అంబేడ్కర్ దేనని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ అంబేడ్కర్ ఆశయాలతో రాజ్యాంగా హక్కులతో , స్ఫూర్తితో అభివృద్ధి సాధించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బొమ్మ రమేష్, గంధమల్ల నర్సింహులు, మధుసూధన్‌రెడ్డి, బాల్‌నర్సయ్య, మహేందర్‌గౌడ్, పాండారి పాల్గొన్నారు.

● రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ , జగ్జీవర్‌రామ్ విగ్రహాల ఆవిష్కరణలపై ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు చిన్నచూపు తగదని బోడుప్పల్ మాజీ కార్పోరేటర్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు బొమ్మ రమేష్ ఆరోపించారు. ఆదివారం మండలంలోని కొత్తజాలలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఉదయం 12 గంటలకు విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమం ఉండగా రాత్రి 6నర గంటలకు ప్రారంభించటమేమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్‌లపై చిన్నచూపు తగదని అన్నారు.

సీనియర్ జర్నలిస్టు సురేష్‌రెడ్డి మృతి


సురేష్‌రెడ్డి(ఫైల్‌ఫొటో)

భువనగిరి టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రెండు దశాబ్దాల పైబడి పాత్రికేయ వృత్తిలో కొనసాగుతున్న భువనగిరికి చెందిన సీనియర్ జర్నలిస్టు ఏనుగు సురేష్‌రెడ్డి (53) శనివారం రాత్రి మృతి చెందాడు. ఆదివారం అంత్యక్రియలు పూర్తయ్యాయి. నోటి క్యాన్సర్‌తో కొన్ని సంవత్సరాలుగా పోరాడుతున్న ఆయన తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందాడు. అయితే క్యాన్సర్ బాధితుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా నోటి క్యాన్సర్ బాధితులకు చికిత్సలు, నియంత్రణ తదితర అంశాలపై అవగాహన కల్పించడంతో పాటు స్వయంగా కౌన్సిలింగ్ చేసేవాడు. సుమారు 30వేల పైబడి ఫాలోవర్స్ అతను భువనగిరి ఫేస్‌బుక్‌గా అందరికీ సుపరిచితుడు ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, వైస్‌చైర్మన్ మాయ దశరథ, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ ఎండీ.అవేజ్ చిస్తీ, బీజేపీ, సీపీఎం జిల్లా కార్యదర్శులు చందా మహేందర్‌గుప్త, ఎండీ.జహంగీర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కొలుపుల అమరేందర్‌తో పాటు పలువురు ప్రముఖులు సురేష్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు, జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో నివాళులు అర్పించి అతడి పాత్రికేయ వృత్తి చిత్తశుద్ధిని కొనియాడారు. సురేష్‌రెడ్డికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

మోత్కూరు విద్యార్థులకు డాక్టర్ పట్టాలు



హైదరాబాదు రామంతాపూర్ హోమియో మెడికల్ కళాశాలలో డాక్టర్ పట్టా అందుకుంటున్న మోత్కూరు విద్యార్థి శ్రీకాంత్‌రెడ్డి

మోత్కూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మోత్కూరు పట్టణానికి రైతు కుమ్మరికుంట్ల దయాకర్‌రెడ్డి-లక్ష్మీ కుమారుడు శ్రీకాంత్‌రెడ్డి, ఆర్ఎంపీ డాక్టర్ గనగాని నర్సింహ-రేణుకల కుమారుడు సాయి ప్రమోద్‌కుమార్, హోమియోపతి డాక్టర్లుగా పట్టాలు అందుకున్నారు. నిరుపేద రైతు కుటుంబానికి చెందిన శ్రీకాంత్‌రెడ్డి, ఆర్ఎంపీ డాక్టర్ కుటుంబానికి చెందిన ప్రమోద్‌కుమార్ పట్టుదలతో చదివి 2018లో హైద్రాబాదు రామాంతపూర్‌లోని జెఎస్‌పీఎస్ ప్రభుత్వ హోమియో మెడికల్ కళాశాలలో సీట్లు సాధించారు. శనివారం సాయంత్రం కళాశాల ఆవరణలో నిర్వహించిన డాక్టర్ పట్టాల ప్రదానోత్సవ కార్యక్రమంలో వారు కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.లింగరాజు, కెఎన్ఆర్‌యూహెచ్ఎస్ వరంగల్ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సంధ్యారాణి చేతుల మీదుగా డాక్టర్ పట్టాలు అందుకున్నారు. ఈ సందర్భంగా వారిని తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు అభినందించారు.

శాంతి, సామరస్యమే అన్ని మతాల సారాంశం

భువనగిరి టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): శాంతీయుతంగా, కలసిమెలసి, పరస్పర సేవా భావంతో జీవించడమే అన్ని మతాలు బోధిస్తున్న సారాంశమని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం భువనగిరిలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన మాట్లాడారు. మైనార్టీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. క్రిస్టియన్ల సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన క్రిస్మస్ విందులో క్రిస్టియన్స్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ ఎండి అవేజ్ చిస్తీ, ఆర్డీవో కృష్ణారెడ్డి, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

వలిగొండ: మండలంలోని నర్సయ్యగూడెం గ్రామంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. కేక్‌కట్ చేసి పంపిణీ చేశారు. కార్య క్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పీఎన్. రెడ్డి హాజరయ్యారు. మాజీ ఎంపీటీసీ పసుల జ్యోతి, మాజీ సర్పంచ్ తుమ్మల దామోదర్, నాయకులు చిట్టెడి అభితేజ్‌రెడ్డి, తుమ్మల శ్రీను పాల్గొన్నారు.


వలిగొండ: క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పీఎన్.రెడ్డి

పీవీ.రావు, కాకా ఆశయ సాధనకు కృషి



పీవీ.రావు, వెంకట్‌స్వామి ఫ్లెక్సీల వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

భువనగిరి గంజ్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ హక్కుల పరిరక్షకుడు పివి రావు, శ్రామిక వర్గం కోసం నిరంతరం పోరాడిన (కాకా) వెంకటస్వామి ఆశయ సాధనకు కృషి చేయాలని ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కో కన్వీనర్ కుశంగల రాజు అన్నారు. ఆదివారం భువనగిరి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో పివి రావు 19వ వర్థంతి, కేంద్ర మాజీ మంత్రి సిడబ్ల్యూసి మెంబరు గడ్డం వెంకటస్వామి లకు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితుల అభ్యున్నతి కోసం నిరంతరం ఆరాటంతో పోరాటాలు చేసిన మహనీయుల అని కొనియాడారు. కార్యక్రమంలో మాల జర్నలిస్టు అసోసియోసన్ కో కన్వీనర్ దొంత సత్యం, రావుల సుధాకర్, బొంతల నర్సింగరావు, దొనకొండ నర్సింగరావు,నిలుగొండ శివ, సంగిశెట్టి స్వామిదాస్, మాదాసు వినోద్, పడిగం కిషన్, బాజా స్వామి, ఉప్పల నరసయ్య, సుదర్శన్, సత్యనారాయణ, కృష్ణ, గణేష్ పాల్గొన్నారు.

మోత్కూరు: పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవితలక్ష్మీనర్సింహారెడ్డి, మునిసిపల్ కమిషనర్ సి.శ్రీకాంత్, వైస్‌చైర్మన్ బొల్లెపల్లి వెంకటయ్య, కౌన్సిలర్ పురుగుల వెంకన్న, నాయకులు లెంకల వేణు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అడ్డగూడూరు: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఎంపీడీవో శంకరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి : సీపీఎం

ఆలేరు: పార్లమెంట్‌లో భారత రాజ్యాంగా నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానపరిచేవిధంగా వ్యాఖ్యలు చేసిన కేంద్రమంత్రి అమిత్‌షాను మంత్రివర్గం నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని సీపీఎం జిల్లా కమిటీ పట్టణ సభ్యుడు ఎంఏ. ఇక్బాల్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో దిష్టిబొమ్మను దహనం చేశారు.

క్రీడాకారులకు వాలీబాల్ కిట్లు పంపిణీ

ఆలేరు: ఆలేరు మునిసిపాలీటీ పరిధిలోని బహదూర్‌పేటకు చెందిన కాంగ్రెస్ నాయకుడు అంగాడి ఆంజనేయులు ఈ వార్డు క్రీడాకారులకు ఆదివారం వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పరుశ నరేష్, నాయకులు వట్టిపల్లి వినయ్, గుజరాజు ప్రకాష్, పుప్పల రాజేష్, సంగి రంజిత్ పాల్గొన్నారు.

పాడి రైతు కుటుంబానికి ఆర్థిక సహాయం

ఆలేరు: ఆలేరు పట్టణానికి చెందిన శ్రీ కృష్ణ పాల సొసైటీ సభ్యుడు పాడి రైతు ఎలుగల రంగయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించారు. బాధిత కుటుంబానికి మదర్‌డెయిరీ సంస్థ రూ. 10వేలు ఆర్థిక సహాయం అందజేసింది. పాల సొసైటీ చైర్మన్ దూడల సురేష్ ఆర్థిక సహాయం చెక్కును రంగయ్య కుమారుడు పాపయ్యకు అందజేశారు.

యాదగిరి మృతి బీఆర్ఎస్‌కు తీరనిలోటు

భువనగిరి రూరల్ : బీఆర్ఎస్ సీనియర్ నేత మాజీ ఉప సర్పంచ్ బొమ్మారపు యాదగిరి మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని తాజ్‌పూర్‌లో యాదగిరి ఫ్లెక్సీ వద్ద నివాళులర్పించారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

సంస్థాన్ నారాయణపురం: సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో గంగపుత్ర కాలనీ, అంబేడ్కర్ కాలనీల్లో డీఎంఎఫ్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆదివారం మాజీ ఎంపీపీ గుత్తా ఉమాదేవి ప్రేమ్‌చందర్‌రెడ్డి ప్రారంభించారు. నాయకులు కరంటోతు శ్రీనివాస్ నాయక్, మందుగుల బాలకృష్ణ, లింగస్వామి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న మల్లేష్‌యాదవ్, ప్రవీణ్

మోటకొండూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): యువజన కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ మాజీ మండల అధ్యక్షుడు సిరబోయిన మల్లేష్ యాదవ్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మంగ ప్రవీణ్, మండల అధ్యక్షుడు బుగ్గ శ్రీనివాస్ కోరారు. ఇటీవల జరిగిన యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో గెలుపొందిన మండల అధ్యక్షుడు బుగ్గ శ్రీనివాస్, అసెంబ్లీ ఉపాధ్యక్షుడు ఎండి మంజూర్, కార్యదర్శులుగా భూమండ్ల మహేష్, కొల్లూరి వేణు, ఎరుకలి గణేష్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా రేగు రమేష్‌లను కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి మహేందర్ అధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలోని బస్టండ్ ఆవరణలో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 10 సంవత్సరాలుగా ప్రతిపక్షంలో ఉంటూ మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేసిన సీనియర్ నాయకులను స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోకుండా నూతనంగా పార్టీలో చేరిన వారికి, బంధువులకు ప్రాధాన్యం ఇస్తూ పార్టీకోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలను విస్మరించడం సరికాదన్నారు. పార్టీ గెలుపులో కీలక పాత్ర పోషించిన సీనియర్ నాయకులు, కార్యకర్తలను సమన్వయంచేసి, తగిన ప్రాధాన్యం కల్పించాలని అన్నారు.

● మండల కేంద్రంలో ఆదివారం జరిగిన యువజన కాంగ్రెస్ సన్మాన సభ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ఫొటో కనిపించక పోవడంతో కాంగ్రెస్ నేతల మధ్య వర్గ విబేధాలు బహిర్గతమయ్యాయి. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెలిమినేటి సురేష్, మాజీ సర్పంచ్ బుగ్గ శ్రీశైలం, గ్రామశాఖ అధ్యక్షుడు అనంతుల నవీన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ బుగ్గ పర్వతాలు, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి శ్రీనివాస్, ఉప సర్పంచ్‌ల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు ఎలిమినేటి జంగారెడ్డి, భూమండ్ల బంగారి పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా కమిటీలో ప్రాధాన్యం



కృష్ణారెడ్డి, కరుణాకర్

చౌటుప్పల్ టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సీపీఎం జిల్లా కమిటీలో చౌటుప్పల్ మండలానికి తగిన ప్రాధాన్యం లభించింది. మండలం నుంచి జిల్లా కమిటీలోకి ఆరుగురిని తీసుకున్నారు. అందులోను కార్యదర్శి వర్గంలోకి తీసుకోవడం ఇదే మొదటి సారి కావడం విశేషం. మందోళ్ల గూడెం గ్రామానికి చెందిన బూరుగు కృష్ణారెడ్డికి అవకాశం లభించింది. 1985లో డీవైఎఫ్ఐ లో చేరిన కృష్ణారెడ్డి అంచెలంచెలుగా పార్టీలో ఎదిగారు. సీపీఎం గ్రామ , మండల కార్యదర్శిగా, జిల్లా కమిటీ సభ్యుడిగా బాధ్యతలను నిర్వహించారు. ప్రస్తుతం ఉన్న ఎండి. పాషా, ఎ.రామేశ్వరీ, గంగదేవి సైదులు తో పాటు కొత్తగా గోశిక కరుణాకర్, రాగీరు కిష్టయ్యను జిల్లా కమిటీ సభ్యులుగా నియమించారు. పార్టీ చౌటుప్పల్ పట్టణ కార్యదర్శి గోశిక కరుణాకర్‌ను జిల్లా కమిటీ సభ్యుడిగా తీసుకున్నారు. పార్టీ పటిష్టతకు మరింత ఉత్సాహంతో పని చేస్తానని కరుణాకర్ తెలిపారు.